## పోలవరం ప్రాజెక్టు

# ఇంతకంటే ఘోరం ఇంకోటి ఉండదు

–కె. బాలగోపాల్

**జం**తువుకు తలా తోకా ఉంటాయి. జంతువు రూపురేఖలు అర్థం చేసుకోవాలంటే తల దగ్గర మొదలుపెట్టి తోకదాకా పరిశీలించడం మానవ మాత్రులయిన వారికి సహజం. తోక దగ్గర మొదలుపెడతాననే వాడిని మామూలుగా వెర్రివాడంటాం.

ఇప్పుడు మనకొక ముఖ్యమంత్రి వచ్చాడు. ఈయన వ్యవసాయదారులకు ఎట్టి పరిస్థితిలోనూ సాగునీరు ఇస్తానంటున్నాడు. ఎప్పటికైనా హామీ ఇచ్చిన అన్ని ప్రాజెక్టులూ కట్టేస్తానంటున్నాడు. కడుతున్నాడు కూడా. కానీ తోక దగ్గర మొదలుపెడుతున్నాడు. ఇది ఆయన సొంత విషయమయితే వెర్రివాడనుకుందుము. కానీ మనందరి విషయం కాబట్టి మనల్ని వెర్రివాళ్లను చేస్తున్నాడనక తప్పదు.

ఒక నీటి పారుదల ప్రాజెక్టు కట్టాలంటే మొదట నీళ్లుండాలి. దానిని వాడుకునే హక్కు మనకుండాలి. ఇది మొట్టమొదటి విషయం. ఆ తరువాత ప్రాజెక్టుకొక ప్రణాళిక ఉండాలి. అది సాంకేతికంగా ఆమోదనీయం కావాలి. ఆపైన ప్రాజెక్టుకయ్యే ఖర్చు, దాని వల్ల వచ్చే ప్రయోజనాల అంచనా ఉండాలి. దాని ప్రకారం కూడా అది ఆమోదనీయం కావాలి. ప్రాజెక్టు వల్ల అడవి మునిగేటట్టయితే కేంద్ర అటవీశాఖ ఆమోదం కావాలి. ఎంత అడవి భూమి మునిగితే అంత భూమిని అడవి పెంపకానికి వేరొకచోట అప్పగించనిదే కేంద్ర అటవీశాఖ సాధారణంగా ఆమోదం ఇవ్వదు. ప్రాజెక్టు వల్ల ఆదివాసులు నిర్వాసితులయ్యేటట్టయితే కేంద్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆమోదం కావాలి. పునరావాసం గురించి ఎంతో కొంత హామీ ఇవ్వనిదే ఆ ఆమోదం లభించడం కష్టం.

ఇవి పాలనా నియమాల ప్రకారం, చట్టం ప్రకారం తప్పనిసరి విషయాలు. ముంపుకు గురయ్యే ప్రజల పునరావాసం కూడా చట్టంలో ఒక హక్కయి ఉంటే ముంపుకు సంబంధించిన సమగ్రమైన అంచనా, ముంపుకు గురయ్యేవారికి కల్పించబోయే పునరావాసాన్ని గురించి సమగ్రమైన అంచనా కూడా తప్పనిసరి అయివుండేవి. కానీ పునరావాసం ఒక హక్కు కాకపోవడం భారతదేశపు చట్టాల లోని అత్యంత బాధాకరమైన లోపాలలో ఒకటి. అయినప్పటికీ ఇది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విలువ కాబట్టి ముంపు, పునరావాసాల అంచనా కూడా ముందుగా ఉండాలని ప్రజా చరిత్ర ఉద్యమాలు అంటున్నాయి.

ఇవన్నీ అయిన తరువాతే ప్రాజెక్టు నిర్మాణం మొదలు కావాలి, దానికి టెండర్లు పిలవాలి, పని మొదలుపెట్టాలి. కానీ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మొదట చెప్పిన చర్యలేవీ చేపట్టకుండా నేరుగా టెండర్లు పిలవడం మొదలుపెట్టింది. వేల కోట్లు కేటాయించి కాలవలు తవ్విస్తూ ఉంది. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ కూడా ప్రాజెక్టుల ప్రక్రియను తోక దగ్గర ఎందుకు మొదలుపెడుతున్నావు అని అడగకుండా తానూ తోక దగ్గరే చర్చ పెడుతున్నది. టెండర్లలో అక్రమాలు, ఏకపక్ష వైఖరి ప్రాజెక్టుల గురించి జరిగే ఏకైక చర్చ అయింది.

తలను విడిచిపెట్టి తోక దగ్గర మొదలుపెట్టిన భారీ ప్రాజెక్టులలో ఒకటి పోలవరం. అప్పుడెప్పుడో 1970లలో, 1980లలో తయారు చేసిన ప్రణాళిక తప్ప ఆ ప్రాజెక్టుకు ఈ మధ్య తయారుచేసిన ప్రణాళికేదీ లేదు. అప్పట్లో తయారుచేసిన ప్రణాళికకు ఆమోదమూ లేదు. ఎంత భూమి మునుగుతుందో, ఎంతమంది నిర్వాసితులవుతారో ఖచ్చితమైన అంచనా ఆనాడూ లేదు, ఈనాడూ లేదు. ఆనాడు ప్రభుత్వం చెప్పిన అంచనా సరయినది కాదని, ప్రభుత్వం 213 గ్రామాలు మునుగుతాయని అంటుండగా నిజానికి 276 గ్రామాలు మునుగుతాయని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) పరిశోధన చేసి తేల్చింది.

ఇప్పుడు ఆ మాత్రం అంచనా కూడా లేకుండా మళ్లీ ప్రభుత్వం పోలవరం పనులు మొదలు పెట్టింది. గతంలో పునాదిరాళ్లు వేయడంతో సంతృప్తి చెందింది. ఈసారి కాలవల తవ్వకం ఉధృతంగా సాగుతున్నది. కాబట్టి ప్రాజెక్టు నిజంగా కట్టేస్తారేమోనని ముంపుకు గురికాగల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఈ నేపథ్యంలో పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, ఖమ్మం జిల్లాలలో ముంపుకు గురికాగల ప్రాంతాలలో మానవహక్కుల వేదిక పర్యటించింది. ఆదివాసుల సంఘాల ప్రతినిధులతో కలిసి చేసిన ఈ పర్యటనలో మేము గ్రామస్తులతో వివరంగా మాట్లాడాము. వారి ప్రస్తుత జీవిత స్థితిగతుల గురించి, రేపు నిర్వాసితులయితే కోల్పోయే జీవనాన్ని గురించి, హక్కుల గురించి వారిని అడిగి తెలుసుకున్నాము, ప్రాజెక్టు గురించి వారి అభిప్రాయం అడిగాము, మాకు తోచింది చెప్పాము.

ముంపుకు సంబంధించిన అధికారిక నివేదిక ఏదీ లేదు కాబట్టి తొలినాటి అంచనాల ననుసరించి 1996లో 'సెస్' వారు ప్రకటించిన రిపోర్టును ఆధారం చేసుకొని ఒక అవగాహనకు రావడం తప్ప చేయగలిగింది లేదు. ఆ నివేదిక ప్రకారం పోలవరం డ్యాం ఎత్తు (పూర్తి రిజర్వాయర్ స్థాయి – ఎఫ్ఆర్ఎల్) 150 అడుగుల కాంటూర్‌లో ఉంటుంది. కాబట్టి ఆ కాంటూర్ వరకు డ్యాంకు ఎగువన నది వెడల్పవుతుంది. ఆ కాంటూర్ వరకు నదికి ఇరువైపులా నీళ్లు నిలుస్తాయి. అయితే 'సెస్' నివేదిక గుర్తించినట్టు ఎఫ్ఆర్ఎల్ 150 అడుగుల కాంటూర్‌లో ఉన్నట్టయితే ముంపు కేవలం 150 అడుగుల కాంటూర్‌కే పరిమితం అవుతుందని అనుకోవడం సరయినది కాదు. నదిలో ప్రవాహం వేగంగా ఉన్నప్పుడు, అలల తాకిడి ఉన్నప్పుడు ఇంకా ఎక్కువ కాంటూర్‌లో ముంపు ఉండగలదు. కాబట్టి 160 అడుగుల కాంటూర్ దాకా మునుగుతుందని అంచనా వేయడం సబబు. అంతే కాకుండా కాగితం మీద కాంటూర్ వేసుకొని దాని ప్రకారం మాత్రమే ముంపును అంచనా వేసేటట్టయితే అసంబద్ధమైన పరిస్థితి తలెత్తవచ్చని కూడా సెస్ నివేదిక గుర్తించింది. ఒక ఊరిలో పొలాలు పొత్తం మునిగి ఆవాసాలు మాత్రం మిగలవచ్చు. అప్పుడు ఆ ఊరు 'ముంపు గ్రామం' కాదంటే ఎట్లా? పొలాలు మొత్తం పోగొట్టుకొని వాళ్లక్కడ ఏ విధంగా బతుకుతారు? ఇది

ఆదివాసుల గ్రామాలకు ఎక్కువగా వర్తిస్తుందని సెస్ నివేదిక గుర్తించింది. వారి సాగుభూములు నది ఒడ్డున ఉంటాయి, ఇళ్లు ఎత్తు మీద ఉంటాయి. నది వెడల్పయి సాగుభూములు మునిగి ఇళ్లు మిగిలితే వారక్కడ ఉండి ఏం చేసుకొని బతకాలి? ఏం తిని కడుపు నింపుకోవాలి?

ఈ విధంగా వివేచించి 'సెస్' నివేదిక 276 గ్రామాలు ముంపుకు గురవుతాయని, అప్పటి లెక్కల ప్రకారం 27,798 కుటుంబాలు, లక్షా 17 వేల జనాభా నిర్వాసితులవుతారని అంచనా వేసింది. ఆ నివేదిక తయారయి ఒక దశాబ్దం గడిచింది కాబట్టి గ్రామాలు అన్నే ఉన్నా కుటుంబాల సంఖ్య, జనాభా పెరిగే ఉంటాయి.

## మండలాల వారీగా ముంపుగ్రామాలు

| **మండలం** | **గ్రామాల సంఖ్య** |
|---|---|
| ఖమ్మం జిల్లా | |
| వరరామచంద్రాపురం | 45 |
| కూనవరం | 48 |
| చింతూరు | 17 |
| కుకునూరు | 34 |
| వేలేరుపాడు | 39 |
| భద్రాచలం | 13 |
| బూర్గుంపాడు | 9 |
| పశ్చిమ గోదావరి జిల్లా | |
| పోలవరం | 29 |
| తూర్పు గోదావరి జిల్లా | |
| దేవీపట్నం | 42 |

ఈ గ్రామాల జనాభాలో 47 శాతం ఆదివాసులు, 15 శాతం దళితులు, 23 శాతం వెనుకబడిన కులాలు, 15 శాతం అగ్రకులాలు అని 'సెస్' అంచనా వేసింది. చింతూరు, పోలవరం, వేలేరుపాడు, దేవీపట్నం, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలలో నిర్వాసితులు కాగల జనాభాలో ఆదివాసులు సగం కంటె ఎక్కువ. కుకునూరు, బూర్గుంపాడు మండలాలలో నిర్వాసితులలో మెజారిటీ దళితులు.

ముంపంటూ వస్తే ఈ ప్రజలు ఏం కోల్పోతారు? ఒక హక్కుగా ఏం పొందుతారు? ఇక్కడే నిర్వాసితులు కాబోయే వారిలో ఆదివాసులకూ ఇతరులకూ తేడా వస్తుంది. అందరూ ఎంతో కొంత కోల్పోతారు, అందరికీ ప్రాజెక్టు వల్ల నష్టం ఉంది, సందేహమేమీ లేదు. మా పర్యటనలో భాగంగా మేము వేలేరుపాడు మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించినప్పుడు, మేము చెప్పిందంతా శ్రద్ధగా రాసుకున్న విలేకరులు ఆ శ్రద్ధకు కారణం మేము అడగకుండానే చెప్పారు. 'మండల కేంద్రం కూడా మునుగుతుంది కాబట్టి మేము కూడా వ్యతిరేకమే సార్ ఈ ప్రాజెక్టుకు. మీ వార్త బాగా రాస్తాం' అన్నారు.

అయితే ఆదివాసులకు ప్రత్యేకంగా ఉండే సమస్య ఏమిటంటే వారి జీవనాధారమైన వనరులపైన

వారికి ఉన్న చట్టపరమైన హక్కు చాలా స్వల్పం. చట్టపరమైన హక్కున్న స్థిరాస్తులు స్వాధీనం చేసుకున్నప్పుడు మాత్రమే చట్టపరమైన నష్టపరిహారం దక్కుతుంది. నిజానికి చట్టపరమైన హక్కున్న భూమిలో కూడా పూర్తిగా సొంత భూమి కాక ప్రభుత్వం డి-ఫారం పట్టా ఇచ్చిన భూమి అయినట్ట యితే నష్టపరిహారం దక్కదని మన హైకోర్టు ఒకనాడు అభిప్రాయపడిందిగానీ, ఈ మధ్యనే ఏడుగురు జడ్జిల బెంచి ఆ అభిప్రాయాన్ని తిరగదోడి నష్టపరిహారం విషయంలో సొంత పట్టా అయినా డి-ఫారం పట్టా అయినా ఒకటేననింది.

అయితే ఆదివాసులు చట్టపరమైన హక్కు ఉన్న భూమే కాక కొండపోడు భూములను కూడా దాదాపు ప్రతీ ఊరిలోనూ ఏదో ఒక మేరకు అనుభవిస్తున్నారు. వారిలో మరీ పేదలకు ఇదొక్కటే జీవనాధారం. ఈ భూమిని రేపు కోల్పోతారు గానీ దీనికేం నష్టపరిహారం దక్కదు. ఇదికాక, సంఘాలు గట్టిగా ఉన్నచోట వారు పోరాటాలు చేసి ఆక్రమించుకున్న గిరిజనేతరుల భూమి చాలా ఉంది. ఎల్‌టిఆర్ చట్టం కింద కేసు వేసి గెలిచినట్టయితే ఆ భూమికి పట్టాలు ఉండేవేమోగానీ అది అన్ని సందర్భాలలోనూ సాధ్యం కాకపోవచ్చు. కోర్టుకెక్కితే సాక్ష్యాలు చూపలేక ఓడిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఆ విధంగా ఆక్రమించుకున్న భూమికి పట్టాలు ఉండవు కదా. పంట వేసుకొని పండించుకోవడానికి పట్టాలు అక్కరలేదు కాని ఆ భూమిని బ్యాంకులో తనఖాపెట్టడానికో మరొకరికి కుదువ పెట్టడానికో అయితే కావాలి. అలాగే రేపు ముంపు వస్తే పట్టాలు లేని కారణంగా వాళ్లకు దమ్మిడీ నష్టపరిహారం దక్కదు. మేము పర్యటించిన మేరకు దేవీపట్నం మండలం (తూర్పు గోదావరి జిల్లా)లో ఈ సమస్య పెద్ద ఎత్తునే ఉంది.

భూమికాక వారికి వేరే ప్రధానమైన జీవనాధారం అడవి నుండి సేకరించే చిన్నతరహా అటవీ ఉత్పత్తులు. దీనిలో మళ్లీ రెండు రకాలుంటాయి. ఒకటి అమ్మకానికి పనికొచ్చేవి. వీటిని గిరిజన సహకార సంఘానికో, వ్యాపారులకో అమ్ముకుంటారు. రెండు, నిత్య జీవితంలో వాడుకునేవి. మొదటి కోవకు చెందినవి జిగురు, తేనె, కరక్కాయలు, గానుగ గింజలు, ముష్టి గింజలు, కుంకుడు కాయలు, చిల్లగింజలు, నల్లజీడి గింజలు, చీపురు పుల్లలు, నరమామిడి చెక్క, శీకాకాయలు, కొండ జీడి పిక్కలు, తంగేడు గింజలు, అడ్డాకులు, విప్ప పలుకులు మొదలయినవి. వ్యవసాయ పనులు లేని సీజన్‌లో వీటి సేకరణ, అమ్మకం ప్రాణాన్ని నిలుపుతుంది. సంవత్సరంలో రెండు నెలలదాకా ఈ ఆదాయం మీదే బ్రతికే ఊర్లు చాలా ఉన్నాయి. రెండవ కోవకు చెందినవి రకరకాల దుంపలు, లేక గడ్డలు, బలుసాకు వంటి ఆకుకూరలు. ఇవి నేరుగా ఆహారంగా ఉపయోగపడతాయి. ఏ తిండీ దొరకనప్పుడు అడవికిపోయి దుంపలు (తేగదుంప, బల్లదుంప, అడవి కంద, కిరస దుంప, తాడిదుంప వగైరా) తెచ్చుకొని వండుకొని తిని బతుకుతారు.

అడవి నుండి బయటకు పోవలసి వస్తే ఈ ఆదాయం, ఈ ఆహారం మొత్తంగా పోతుంది. దీనికి ఏ నష్టపరిహారం ఉండదు, ఏ ప్రత్యామ్నాయమూ ఉండదు.

పశుగ్రాసానికి కొదవలేక పోవడం వల్ల అడవిలోని అన్ని ఊర్లలోనూ వందల సంఖ్యలో పశువులు - ముఖ్యంగా ఆవులు ఉన్నాయి. గోచీ తప్ప వేరే బట్ట ఎరుగనివారికి సహితం 10-15 ఆవులున్నాయి. వాటిని పోషించనక్కరలేకుండా అవే యజమానిని పోషిస్తాయి. రేపు ఈ పశువులను తోలుకొని అడవి బయటకు పోయినట్టయితే పశుగ్రాసం ప్రధానమయిన సమస్య అవుతుంది. ఈ మధ్య కాలంలో మైదాన ప్రాంత గ్రామాలలో పెద్ద రైతులు సహితం పది పశువులు ఉంచుకోవడానికి తటపటాయిస్తున్నారు. ఇంక ఆదివాసీ నిర్వాసితుల సంగతి ఏం చెప్పాలి?

ఊరుమ్మడి చెట్లు అడవిలో ఒక ముఖ్య ఆహార వనరు. చింతచెట్లు, మామిడిచెట్లు, తాడిచెట్లు వీటిలో ప్రధానమైనవి. తాటికల్లుకు ఆదివాసుల జీవితంలో చాలా ప్రాధాన్యత ఉంది. అది కేవలం నిషా ఇచ్చే మత్తు పదార్థం కాదు, పోషకాహారం. వేసవిలో ఊర్లకు ఊర్లు తాటి కల్లు మీదనే బతుకు తాయి. ఒక్కొక్క ఊరిలోనూ వందల సంఖ్యలో ఉన్న ఈ చెట్లను విడిచిపెట్టి రేపు బయటకు పోయినట్లయితే వారు కోల్పోయే ఈ ఆహారానికి నష్టపరిహారం ఏమీ దక్కదు.

ఆదివాసులకు ఏజెన్సీలో ఉండే ప్రత్యేకమైన హక్కులున్నాయి. ఇవి రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలు కింద జారీ అయినవి. ఏజెన్సీలో ఉంటేనే ఈ హక్కులు ఉంటాయి. వారి భూములను గిరిజనేతరులు ఏ రకంగానూ సొంతం చేసుకోవడానికి వీలులేదు. ప్రభుత్వ బంజర్లు వారికి తప్ప వేరెవ్వరికీ సాగుకు ఇవ్వడానికి వీలులేదు. గ్రామ సర్పంచ్, మండల ప్రెసిడెంట్ పదవులకు నూటికి నూరుశాతం వారికే రిజర్వేషన్ ఉంది. టీచర్ పోస్టులలో 100 శాతం, కొన్ని ఇతర నాల్గవ తరగతి ఉద్యోగాలలో 75 శాతం దాకా ఆదివాసీ విద్యావంతులకే రిజర్వ్ అయి ఉన్నాయి. స్థానిక వనరుల యాజమాన్యానికీ అభివృద్ధి పనులకూ సంబంధించి ఆదివాసీ గ్రామ సభకు, గ్రామ పంచాయతీకీ ప్రత్యేక అధికారాలు పంచాయతీరాజ్ చట్టంలోని 6-ఎ అధ్యాయం కింద ఉన్నాయి. ఏజెన్సీని విడిచిపెట్టిపోతే ఇవన్నీ పోతాయి.

అన్నిటినీ మించి ఆదివాసీ గ్రామాలలో ఒక అనిర్వచనీయమైన ఉమ్మడితనం ఉంటుంది. ఇది మనుషులకే కాదు, వారి చుట్టూ ఉన్న చెట్లకూ కొండలకూ కూడా వర్తిస్తుంది. వారి జీవితం, ఆచారాలు, అలవాట్లు దీనిని పెనవేసుకొని ఉంటాయి. దానివల్ల పొందే మానసిక సంతృప్తికీ ప్రశాంతికీ 'నష్టపరిహారం' అంటూ ఏదీ ఉండదు. అడవి బయట దీనిని పునర్నిర్మించుకోవడం దాదాపు అసాధ్యం.

అందుకే పునరావాసం గురించి మాట్లాడితే ఆదివాసులు నవ్వుకుంటూ చెట్టుకు చెట్టు, పుట్టకు పుట్ట, కొండకు కొండ, వాగుకు వాగు ఇట్లాగే కట్టిస్తారా అని అడుగుతున్నారు. కట్టిచ్చేటట్టయితేనే ఇక్కడి నుండి పోతాం అంటున్నారు. చాలామంది నిక్కచ్చిగా ఇక్కడి నుంచి పోనే పోమంటున్నారు. వేరే ఎక్కడో వారికి పునరావాస కాలనీలు కట్టిచ్చి తలా ఎకరమో, రెండో బంజరు భూమి కేటాయించినా ఇప్పుడున్న జీవికలో సగం కూడా దొరకదు వాళ్లకు. ఆ మాత్రం పునరావాసం ఇస్తారన్న నమ్మకం లేదు, ఇవ్వాలని చెప్పే చట్టం గానీ పాలసీ నియమంగానీ ఏదీ లేదు. ఈ సంగతి మూడు జిల్లాలలోని ఆదివాసులకు బాగానే తెలుసును కాబట్టి అత్యధిక భాగం మంది అసలు పోలవరం వద్దే వద్దు అంటున్నారు.

ఇది అభివృద్ధికి అడ్డంపడే వైఖరి అన్న వాదనను వాళ్లూ విన్నారు. దానికి కూడా వాళ్ల దగ్గర జవాబుంది. గోదావరి నీళ్లు 'వృధాగా' సముద్రంలోకి వెళ్లిపోతున్నది కాబట్టి ప్రాజెక్టు కట్టి దానిని సాగుకోసం, తాగునీటి కోసం వాడుకోవాలని కదా ప్రభుత్వం ఆలోచిస్తున్నది? మరి ఆ సాగునీరేదో మా భూములకే ఇయ్యవచ్చుకదా? మా భూములు ముంచి మైదాన ప్రాంతాల భూములకెందుకివ్వాలి? అంటున్నారు.

పోలవరం డ్యాం సైట్ దగ్గర గోదావరిలోకి అకస్మాత్తుగా వచ్చి చేరే నీరేదీ లేదు. అక్కడ నిలప బోయేదంతా పైనుండి వచ్చి చేరే నీరే. ప్రాణహిత నుండి, ఇంద్రావతి నుండి, శబరి నుండి, డజన్ల సంఖ్యలో ఉన్న వాగులు, వంకల నుండి వచ్చి గోదావరిలో కలిసి అడవి గ్రామాలను దాటి

ప్రవహించి పోలవరం చేరే నీటికే డ్యాం కట్టి విజయవాడ నుండి విశాఖపట్నం దాకా వాటిని తీసుకుపోయి 'అభివృద్ధి' సాధించాలని ప్రభుత్వం ఆలోచన. మరి మా ఊరి పక్కనే గోదావరిలో లిఫ్టు పెట్టి ఆ నీళ్లు మాకే ఇస్తే మేమే అభివృద్ధి చెందుతాము కదా? అని వారు అడుగుతున్నారు. అది అభివృద్ధి ఎందుకు కాదు, మైదాన ప్రాంతాలకు ఆ నీటిని పారిస్తేనే అది అభివృద్ధి ఎందుకవుతుందో చెప్పమంటున్నారు.

ఐటిడిఏ వారు చేపట్టిన కొన్ని లిఫ్టు ఇరిగేషన్ స్కీంలు ప్రస్తుతం లేకపోలేదు. ఒక్క తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం డివిజన్లోనే 36 స్కీంలు చేపట్టారు. కానీ అవన్నీ విచిత్రంగా ఫెయిల్ అయి కూర్చున్నాయి. స్థలం ఎంపికలో అసమర్థత వల్లనో, సరుకు కొనుగోలులో అవినీతి వల్లనో గానీ మినహాయింపు లేకుండా అన్ని లిఫ్టులూ ఫెయిల్ అయ్యాయి. కానీ సక్రమంగా చేస్తే పోలవరం కింద మునగబోయే అన్ని గ్రామాలకూ కాకున్నా గోదావరి, శబరి నదులకు దగ్గర ఉన్న గ్రామాలకు సాగునీరు ఇయ్యవచ్చు. ఆపైన మిగిలిన నీటికి పోలవరం దగ్గరే డ్యాం బదులు డైవర్షన్ (ఆనకట్ట) కట్టి ఏ ముంపూ లేకుండ మైదాన ప్రాంతాలకూ కొంత మేరకు పారించుకోవచ్చు.

ప్రాజెక్టుల వల్ల జరిగే ముంపు గురించి, నిర్వాసితుల సమస్యల గురించి ఎప్పుడు మాట్లాడినా 'అభివృద్ధి'కి అడ్డువస్తున్నారన్న చర్చ వస్తుంటుంది కాబట్టి ఇక్కడ రెండు మాటలు చెప్పడం అవసరం అనుకుంటున్నాము. మొదటిది, ప్రజాతంత్ర దృక్పథం అభివృద్ధికి వ్యతిరేకం కాదు, అసమ అభివృద్ధికి వ్యతిరేకం, విధ్వంసక అభివృద్ధికి వ్యతిరేకం. సాగునీటి విషయానికొస్తే, అది వ్యవసాయ అభివృద్ధికి అవసరమే. కానీ ప్రకృతి సిద్ధంగా మనిషికి లభించే ఈ వనరుపైన అందరికీ (సాంకేతిక సాధ్యాసాధ్యాల పరిధిలో) సమాన హక్కు ఉండాలి. పోలవరానికి ప్రతిపాదించిన ఆయకట్టు ఇప్పటికే సాగునీటి లభ్యత ఉన్న ప్రాంతాలలో ఉంది. దాని బదులు అదే నీటిని, విఫలమైన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలే తప్ప పనిచేసే సాగునీటి వ్యవస్థ లేని ఆదివాసీ ప్రాంతాలకే అందివ్వడం న్యాయం కాదా? దానివల్ల స్థూల రాష్ట్ర ఆదాయంలో రాగల పెరుగుదల తగ్గిపోవచ్చు. కానీ ఆ పెరుగుదల ఆదివాసులకు దక్కుతుంది కాబట్టి అదే ప్రజాస్వామికమైన అభివృద్ధి.

రెండవది నిర్వాసితుల హక్కుల సమస్య. భారీ ప్రాజెక్టులను అన్ని సందర్భాలలో వ్యతిరేకించవలసిందేనా అనే చర్చలోకి మేము ప్రస్తుతం పోవడంలేదు. ప్రాజెక్టును నిర్దిష్టంగా పరిశీలించి ఒక నిర్ణయానికి రావడమే ఉచితం అని ప్రస్తుతానికి అనుకుందాం. ఈ నిర్దిష్ట పరిశీలనలో ఏమేం విషయాలు చూడాలి?

ప్రాజెక్టు వల్ల అభివృద్ధి వస్తుంది అని అనుకున్నా, దానిని పొందేది మొత్తం సమాజం కాదు, కొందరేననేది స్పష్టమే. ప్రత్యక్ష ప్రయోజనాలూ పరోక్ష ప్రయోజనాలూ ఉంటాయని అనుకున్నా, రెండూ కలిపినా అది అందరికీ దక్కవు. కాబట్టి ప్రయోజనం పొందేవారు కొందరుంటారు. నష్టపోయే వారూ ఉంటారు. ప్రయోజనం పొందేవారి జీవితాలు కచ్చితంగా బాగుపడతాయి. నష్టపోయే వారి జీవితాలు ఏ మేరకు నష్టపోతాయనేది వారికి దక్కే నష్టపరిహారం మీద, పునరావాసం మీద ఆధారపడి ఉంటుంది. ఒక ప్రాజెక్టు వల్ల నిర్వాసితులయ్యే వారికి, ఆ ప్రాజెక్టు వల్ల వచ్చే ప్రయోజనంలో మొదటి వాటా ఇవ్వాలనేది – నీటిపారుదల ప్రాజెక్టయితే ఆ ప్రాజెక్టు చివరి భూములలో కాక మొదటి భూములలోనే వారికి సాగుభూములు ఇవ్వాలని – ఇవ్వాళ అంతర్జాతీయంగా రూపొందుతున్న నాగరికతా ప్రమాణం. మనం దాని అంచులకు కూడా చేరుకోలేదు.

కాబట్టి నిర్దిష్టమైన పరిశీలనలో వేసుకోవలసిన ప్రశ్నలు ఏమిటంటే ప్రయోజనం పొందేవారు ఎవరు? నష్టపోయేవారు ఎవరు? ప్రయోజనం పొందేవారికి ఈ ప్రయోజనం ఎంత అవసరం? నష్టపోయేవారికి ఆ నష్టం ఎంత వినాశకరం? ఈ ప్రాజెక్టు ద్వారా వినియోగించుకోబోయే వనరును ఇంకొక రకంగా వినియోగించినట్టయితే మొత్తం మీద సామాజిక న్యాయం ఇంకా ఎక్కువగా జరిగే అవకాశం ఉందా? ఇత్యాది.

పోలవరం ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం 7 లక్షల 27 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చి, విశాఖ పట్నంకు మంచినీళ్లిచ్చి, కృష్ణా బేసిన్ కోసం ప్రకాశం బ్యారేజికి 80 టిఎంసిల నీళ్లు తరలించ దలచుకుంది. సాగునీరు ఇచ్చేది తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు, కృష్ణా జిల్లాకు. ఆ జిల్లాలలో ఇప్పటికే డెల్టా కాలవల ద్వారా నీళ్లొచ్చే ప్రాంతం కంటె కొంచెం ఎగువన ఉన్న ప్రాంతానికి ఈ నీళ్లొస్తాయి తప్ప ఆ జిల్లాలలో కూడా పూర్తి మెట్ట ప్రాంతాలకు కాదు.

అవి వర్షపాతం బాగానే ఉండే ప్రాంతాలు. వ్యవసాయేతరంగా కూడా బాగానే అభివృద్ధి చెందిన ప్రాంతాలు. పోలవరం నీళ్లొస్తే అక్కడి ప్రజల జీవితాలు సుసంపన్నం అవుతాయనడంలో సందేహ మేమీ లేదుగానీ పోలవరం నీళ్లు దక్కడం వారికి జీవన్మరణ సమస్య కాదు. విశాఖపట్నంకు మంచినీళ్లు కూడా అంతే. విపరీతంగా పెరిగిపోతున్న ఆ నగరానికి మంచినీళ్లు చాలా అవసరం. కానీ దానికి ప్రత్యామ్నాయం స్థానికంగా లేదా అంటే ఉందనే చెప్పాలి. ఉత్తరాంధ్రలో అనకాపల్లి నుండి ఇచ్ఛాపురం దాకా ఉన్న నీటి వనరులను సరిగ్గా ఉపయోగపెట్టే ప్రయత్నం ప్రభుత్వాలు చేయలేదుగానీ చేస్తే ఆ మూడు జిల్లాల నీటి అవసరాలు స్థానికంగానే తీర్చవచ్చు. పోలవరం నీళ్లు రాకపోతే విశాఖపట్నంకు మంచినీళ్లు దొరకవన్న పరిస్థితేమీ లేదు. ఇక్కడ ఇంకొక అనుమానాన్ని కూడా ప్రస్తావించాలి. పోలవరం నుండి విశాఖపట్నంకు నీళ్లు తెచ్చే పైప్‌లైను రాజమండ్రి–విశాఖపట్నం రైల్వే లైనుకు ఎడమ పక్కన ఉండబోతుంది. ఆ రైల్వే లైనుకు కుడిపక్క నుండే ప్రాంతంలో విశాఖపట్నం–కాకినాడ–విజయవాడ కారిడార్ పేరిట ప్రభుత్వం వేగవంతమైన అభివృద్ధి పేరుతో అనుమతించబోయే స్పెషల్ జోన్‌లూ సాఫ్ట్‌వేర్ పార్కులూ రాబోతాయి. పోలవరం నీళ్లు నిజంగా విశాఖపట్నం ప్రజల తాగునీటి కోసం వినియోగించబోతారా, లేక దారిలో తూర్పుకు మళ్లించి ఈ 'కారిడార్'కు ఇవ్వబోతారా? అనే అనుమానమూ ఉంది.

ఇక కృష్ణా బేసిన్‌కు తరలించడానికి పోలవరం నుండి 80 టిఎంసిల నీళ్లు విజయవాడ దగ్గరున్న ప్రకాశం బ్యారేజికి తీసుకుపోయే విషయం చూద్దాం. ఇది కృష్ణానది ఎగువన ఉన్న తెలంగాణ, రాయలసీమలలోని దుర్భిక్ష ప్రాంతాల వినియోగానికి అని చెప్తున్నారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, కర్నూలు, అనంతపురం జిల్లాలలో తీవ్ర దుర్భిక్షం ఉన్న మాట వాస్తవమే. కృష్ణా జలాల ప్రాజెక్టులు వారికి హామీ యిచ్చిన మాటా వాస్తవమే.

అయితే ఈ కారణంగా పోలవరం ప్రాజెక్టు సమర్థనీయం అనే నిర్ణయానికొచ్చే ముందు కొన్ని విషయాలు చూడాలి. ఒకటి, 80 టిఎంసిల నీళ్లెప్పుడయితే పోలవరం నుండి కృష్ణా బేసిన్‌కు తరలించబడతాయో అప్పుడవి కృష్ణా జలాలలో భాగం అవుతాయి. మనం ఆ నీటిని కర్ణాటకతోనూ మహారాష్ట్రతోనూ పంచుకోక తప్పదు. 80 టిఎంసిలలో 35 వారు తీసుకోగా, 45 మాత్రమే మనకు దక్కుతాయి. ఈ 45 టిఎంసిలు నేరుగా దక్షిణ తెలంగాణకూ రాయలసీమకూ పోవు. ప్రకాశం బ్యారేజిలో చేరతాయి. నది పైభాగం నుండి ప్రకాశం బ్యారేజికి వచ్చే నీటిలో 45 టిఎంసి

ఎగువన ఆపుకున్నట్టయితేనే ఎగువ ప్రాంతాలు ఈ పంపిణీ వల్ల ప్రయోజనం పొందగలవు. అది ఏ సంవత్సరంలో ఎంత మేరకు సాధ్యం అవుతుంది, ఎంత ఎగువన సాధ్యం అవుతుంది అనేది ఆయా సంవత్సరాల వర్షపాతాన్ని బట్టి ఉంటుంది. కానీ 45 టిఎంసిల నీరు మాత్రం ప్రతీ సంవత్సరం పోలవరం నుండి ప్రకాశం బ్యారేజికి వచ్చి చేరుతుంది- ఎందుకంటే గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి కాబట్టి. అంటే ఈ మళ్లింపు తప్పకుండా సాధించేది కృష్ణా డెల్టా స్థిరీకరణ. తెలంగాణ రాయలసీమలకు ప్రయోజనం ఒనగూడవచ్చు, ఒనగూడకపోవచ్చు.

ఆ ప్రాంతాలకు వర్షాభావ సంవత్సరాలలో నష్టం కూడా జరగవచ్చు. పోలవరం నుండి మళ్లించే 80 టిఎంసిలలో మన వాటా 45 టిఎంసిలే అయినా మొత్తం 80 టిఎంసిలూ ప్రకాశం బ్యారేజికి పోతాయి. కర్ణాటక, మహారాష్ట్రలు తమ వాటా కింద నుండి తీసుకోలేవు. మీదనే ఆపుకుంటాయి. అంటే రాష్ట్రంలోకి కృష్ణ, తుంగభద్ర నదులు ప్రవేశించే లోపలే 35 టిఎంసిల నీళ్లు వాళ్లు తుంగభద్ర డ్యాం నుండి గానీ, ఆల్మట్టి నుండి గానీ మళ్లించుకోగలరు. ఇది సగటు సంవత్సరాలలో నష్టం చేయకపోవచ్చును గానీ వర్షభావ సంవత్సరాలలో సహితం ఎగువ రాష్ట్రాలు 35 టిఎంసిలు ఉంచేసుకుంటాయి. కాబట్టి కృష్ణా తుంగభద్రలు రాష్ట్రంలోకి ప్రవేశించే దగ్గరే ఉన్న ప్రాజెక్టులకు నష్టం కలగగలదు. ఇవి తెలంగాణ, రాయలసీమలలోనే ఉన్నాయి: జూరాల, రాజోలిబండ, రేపు రాబోయే భీమ, తుంగభద్ర ఎగువ కాలువ, దిగువ కాలువలు.

కాగా, పోలవరం ద్వారా సుభిక్షమైన కోస్తాంధ్ర జిల్లాలకు, కృష్ణా బేసిన్‌లోని దుర్భిక్ష ప్రాంతాలకు గోదావరి జలాల్ని తరలించే ముందు గోదావరి జలాలు తప్ప వేరే గత్యంతరం లేని ఉత్తర తెలంగాణలోని దుర్భిక్ష ప్రాంతాలకు సాగునీటి వసతి కల్పించడం అవసరం. సాగునీటి పైన సమాన హక్కు ఒక ప్రజాతంత్ర విలువ అన్న మా అభిప్రాయాన్ని పైన చెప్పాము. ఆ దృష్టితో చూసినప్పుడు ఉత్తర తెలంగాణలోని దుర్భిక్ష ప్రాంతాలకు గోదావరి జలాలు తప్ప వేరే ఏ ఆధారమూ లేదు కాబట్టి ఆ ప్రాంతాల అవసరాలు తీర్చగల ఆచరణాత్మక పథకం చేపట్టిన తరువాతే వేరే అవసరాల కోసం – ఎంత న్యాయమైన అవసరాలయినా సరే – గోదావరి జలాల వినియోగాన్ని తలపెట్టాలి. నల్లగొండ, వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాలు కలుసుకునే ప్రాంతం (ప్రజ్ఞాపూర్–సిద్ధిపేట రోడ్డు కేంద్రంగా ఒక అర్ధచంద్రాకారంలో పరచుకొని ఉన్న మెట్ట ప్రాంతం) దుర్భిక్షంలో దక్షిణ తెలంగాణ, రాయలసీమలకు పెద్దగా తీసిపోదు. ఈ ప్రాంతానికి గోదావరి నీళ్లందించే కచ్చితమైన ప్రణాళిక ఇప్పటికీ లేదు. కాగితం మీద చూసినప్పుడు గోదావరిలో మన రాష్ట్ర వాటా చాలానే ఉన్నట్టు తోస్తుంది గానీ గోదావరి జలాల వినియోగంలోని సాంకేతిక సమస్యలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు పరిస్థితి భిన్నంగా కనిపించక మానదు. కరెంటు పెట్టి భారీగా 'లిఫ్టు' చేయకుండ ఉత్తర తెలంగాణలోని మెట్ట ప్రాంతాలకు గోదావరి జలాలు చేరవేయడం సాధ్యపడదు. గోదావరిలో నీళ్లెంత ఉన్నాయనేది కాదు, దానిని తీసుకోవడానికి ప్రభుత్వం ఖర్చెంత పెట్టగలదనేది సమస్య. అంతంత ఖర్చుపెట్టి ఎన్ని ప్రాజెక్టులు కట్టగలదనేది సమస్య. కాబట్టి ఎగువ ప్రాంతాల హక్కులను వ్యవస్థీకరించకుండ దిగువన వేరే వినియోగానికి వనరులు, నీళ్లు కేటాయించడం భావ్యం కాదు.

ఇదంతా ఒకెత్తయితే పోలవరం వస్తే ముంపుకు గురికాగల ప్రజల – ముఖ్యంగా వారిలో సగం పైగా ఉన్న ఆదివాసుల – జీవనానికీ జీవితానికీ జరగగల హాని ఊహకు సహితం అందడం కష్టం. పైన చెప్పినట్టు వాళ్లకు నష్టపరిహారం రాగల స్థిరాస్తులున్నది కొంచెమే. వారి జీవనం ప్రధానంగా ప్రకృతిసిద్ధంగా లభించే సంపదను ఆధారం చేసుకొని సాగుతున్నది. ఆ ప్రకృతిని మొత్తం రేపు

కోల్పోతారు. దానిని తిరిగి ఎక్కడా ఏ రూపంలోనూ ప్రభుత్వం వారికి కల్పించలేదు. వారి విషయంలో పునరావాసం అనే మాటకు అర్థమే లేదు. మామూలు అర్థంలో ఏ ఊరి వెలుపలో ఒక కాలనీ కట్టిచ్చి ఎకరమో రెండెకరాలో బంజరు భూమి ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, పోలవరంలో శతాంశం ముంపు ఉండే ప్రాజెక్టుల విషయంలో పునరావాసం ఏవిధంగా అమలయిందో చూస్తే అది కల్ల అని అర్థం అవుతుంది.

ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకున్నప్పుడు పోలవరం ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకించడమే సరయిన ప్రజాస్వామిక వైఖరి అని మేము భావిస్తున్నాం.